సాక్షి చిత్తూరు

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



జీసీటీఏ నూతన కార్యవర్గం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. - 8లో



నేటి నుంచి కొత్త కార్డులకు..

నేటి నుంచి అన్ని సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎస్‌వో శంకరన్ తెలిపారు. - 8లో



వాన నీటిలో అంతిమ కష్టాలు

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మోకాటి లోతు నీటిలోనే యువతికి అంతిమ యాత్ర నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 2వ తేదీ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమస్యలున్న ప్రజలు అర్జీల రూపంలో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

డీఎస్పీని కలిసిన ఎంపీ మిథున్ రెడ్డి




డీఎస్పీని కలిసేందుకు వస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: పుంగనూరు అల్లర్ల కేసుకు సంబంధించి రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి తదితరులు ఆదివారం పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి వచ్చారు. పుంగనూరు పోలీసులు పెట్టిన కేసులకు సంబంధించి హైకోర్టు వీరికి కండీషనల్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్ ఈ కేసుకు ఐవోగా ఉన్నందున ఆయన ఇక్కడికి న్యాయవాదులతో వచ్చి నిబంధనల మేరకు వ్యవహరించి సంతకాలు చేసి వెళ్లారు. ఆయనకు స్థానిక బైపాస్ రోడ్డు వద్ద పలమనేరు, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డా.సునీల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, దయానందగౌడ, మండీసుధా, చెంగారెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.





వ్యవసాయ బోరు మోటారు(ఇన్‌సెట్) ట్రాన్స్‌కో అమర్చనున్న స్మార్ట్ మీటర్లు



మోటార్లకు మీటర్లు

చంద్రబాబు హయాంలో ఏనాడూ రైతులకు మేలు చేయలేదు. అండగా నిలబడలేదు సరికదా అసలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. వ్యవసాయం దండగ అంటూ క్రాప్ హాలిడే ప్రకటించిన ఘనత చంద్రబాబుదే. ఇంతేనా.. పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరిన రైతులను గుర్రాలతో తొక్కించిన చరిత్ర ఆయనదే. వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఉచిత విద్యుత్‌కు మంగళం పాడిన మహానుభావుడు బాబే. ఎన్నికల ముందు అన్నదాతకు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన టీడీపీ అధినేత అధికారంలోకి వచ్చి, దాన్ని అటకెక్కించారు. స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవని, మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొట్టండి అని చెప్పిన ఆయన ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా ఆ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో ఏర్పాటు
- త్వరలో ఇళ్లకు, ఆపై వ్యవసాయ మోటార్లకు
- ముందుగా రీచార్జ్ చేసుకుంటే కరెంట్.. లేదంటే కట్
- గతంలో స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు తప్పవన్న చంద్రబాబు
- ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా అమలు

పలమనేరు: ఉచితంగా విద్యుత్ ఇచ్చేదిలేదంటూ హైదరాబాద్‌లో రైతులపై బాష్పవాయువు ప్రయోగించి కర్షకులనే కనికరం లేకుండా వారిని గుర్రాలతో తొక్కించి నలుగురు రైతుల మరణానికి కారణమయ్యారు నాడు చంద్రబాబు. ఉచిత కరెంట్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనంటూ హేళన చేశారు. కాని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఆయన స్ఫూర్తితో మొదలైన ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరాటకంగా కొనసాగిస్తూ రైతులకు కరెంట్ కష్టాలనే మాట లేకుండా చేశారు. ఇదే సమయంలో స్మార్ట్‌మీటర్ల వ్యవహారం రావడంతో దీనిపై చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. గత ఎన్నికలప్పుడు కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లిలో బాదుడేబాదుడు కార్యక్రమాన్ని వచ్చిన ఆయన స్మార్ట్‌మీటర్లతో రైతులకు ఉరితాడు తప్పదని గంటపాటు ప్రసంగించారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చేసరికి స్మార్ట్‌మీటర్లను గుట్టుచప్పుడు కాకుండా అమర్చుతున్నారు.

పలమనేరు డివిజన్‌లో..

ట్రాన్స్‌కో పలమనేరు డివిజన్‌లో ఎల్‌టీ–4(కార్యాలయాలు) మొత్తం 6,530 వరకు ఉన్నాయి. వీటికి స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నారు. ఎల్‌టీ–2లో(వాణిజ్య సముదాయాలు, దుకాణాలు) మొత్తం 19,120 ఉన్నాయి. వీటికి వచ్చే డిసెంబర్‌లోపు స్మార్ట్‌మీటర్లను అమర్చనున్నారు. ఆపై ఎల్‌టీ–3(కుటీర పరిశ్రమలు) మొత్తం 1,452 ఉన్నాయి. వీటికి స్మార్ట్‌మీటర్లను పెట్టనున్నారు. తరువాత ఎల్‌టీ–1లో నివాస గృహాలు 1,68,546, ఎల్‌టీ–5లో 54,995 వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఇప్పటికే అమలు

స్మార్ట్‌మీటర్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటిదాకా ఉన్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నారు. ఇప్పటివరకు ఓ వ్యక్తి వచ్చి మీటర్ రీడింగ్ చూసి కరెంట్ బిల్లులు వేసేవారు. కానీ ఇకపై ఎవరితోనూ పని ఉండదు. స్మార్ట్‌ఫోనుకు ముందుగా ఎలా రీచార్జ్ చేసుకుంటామో అలాగే కరెంట్ బిల్లును ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.

త్వరలో ఇళ్లు, మోటార్లకు..

స్మార్ట్‌మీటర్లను గృహాలకు ఆపై రైతుల వ్యవసాయ మోటార్లకు వీటిని అమర్చనున్నారు. దీంతో ఇళ్లకు సైతం వినియోగదారులు ముందుగానే ఆన్‌లైన్ ద్వారా కరెంట్ బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అదే రీతిలో రైతులు సైతం వారి మోటారు హెచ్‌పీ ఆధారంగా ముందుగానే (ప్రీ పెయిడ్) డబ్బులు చెల్లించి, రీచార్జ్ చేసుకోవాలి. కట్టిన డబ్బులు అయిపోగానే ఆటోమెటిక్‌గా విద్యుత్ సరఫరా అవుతుంది.

అడ్డుకుంటున్న వామపక్ష నేతలు

ఇలా ఉండగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లాలోని వామపక్ష నేతలు ఇప్పటికే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఆ మేరకు పలమనేరు ఆర్టీసీ బస్టాండ్, కార్యాలయాల వద్ద సాగుతున్న స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఇక్కడి నేతలు గురువారం అడ్డుకున్నారు. దీనిపై తాము రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వీటి కారణంగా సామాన్య ప్రజలతో పాటు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



ఆర్టీసీ కార్యాలయం వద్ద స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు

మీటర్ రీడర్లకు మంగళం

ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది మీటర్ రీడర్లున్నారు. వీరు ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి కరెంట్ రీడింగ్‌ను తీసి, తద్వారా కరెంట్ బిల్లులు అందించేవారు. ఇకపై స్మార్ట్‌మీటర్ల రాకతో వీరి ఉద్యోగాలు పోయినట్టే. దీంతో వీరు సైతం స్మార్ట్‌మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీనిపై ఆందోళనకు సైతం దిగే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

లబ్ధిదారులకు ఇక ఇక్కట్లే

జిల్లాలోని 75,309 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నారు. జిల్లాలోని 4,163 మంది చేతివృత్తుల వారు, ఎంబీసీ తదితరులకు నెలకు 150 యూనిట్ల వరకు గత ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందించింది. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన ద్వారా 1.05 లక్షల ఇళ్ల సర్వీసులు ఇచ్చారు. సర్వీసుకు రూ.3 వేలు కాగా ప్రభుత్వం కేవలం రూ.125కే కరెంట్ సర్వీసు ఇచ్చింది. వీరంతా ఇకపై స్మార్ట్‌మీటర్ల విధానంలో ముందుగానే డబ్బులు కట్టాల్సిందే. దీంతో నిరుపేదలకు సైతం కరెంట్ కష్టాలు తప్పనట్టే.

రైతులకు ఇబ్బందులు తప్పవు



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తప్పవు. రైతు వరి పంట వేసి నీటి తడులు ఇవ్వాల్సిన తరుణంలో కరెంట్ చార్జీ కట్టలేదని కట్ చేస్తే ఆ పంట ఏమి కావాలి. రైతు కష్టం నేలపాలు కావాల్సిందేనా. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దన్న చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే వాటిని ఎలా అమలు చేస్తున్నారు?

– సుబ్బన్న, కల్లాడు, పలమనేరు మండలం

దుకాణదారులకు ఇబ్బందే



మొబైల్ ఫోన్‌కు మాదిరిగా ఎంత రీచార్జి చేసుకుంటే అంతవరకే కరెంట్ ఇవ్వడం, ఆపై కట్ చేయడం చేస్తే ఎవరికైనా ఇబ్బందే కదా. ఒక్కొక్క నెలలో దుకాణంలో వ్యాపారం తగ్గుముఖం పడితే డబ్బులున్నప్పుడు పెనాల్టీ కట్టి అయినా కరెంట్ బిల్లు కట్టే వెసలుబాటుంటుంది. కానీ ఇప్పుడు ముందుగానే కట్టాలంటే కుదిరేపనేనా.?

– సుభాన్, హోటల్ యజమాని, పలమనేరు

అన్ని కేటగిరిలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లను అమర్చుతున్నాం. వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు ఏర్పాటు చేస్తాం. ఆపై గృహాలు, మళ్లీ రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తాం. ముందుగానే డబ్బు చెల్లించడంతో పెండింగ్ బకాయిల సమస్య తగ్గుతుంది.

– శ్రీనివాసమూర్తి, డీఈ, ట్రాన్స్‌కో, పుంగనూరు

ముంచెత్తిన వాన

- జిల్లాలోనే నగరిలో అధిక వర్షపాతం
- నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్
- జిల్లాలోని 32 మండలాల్లో 1836.8 మి.మీ వర్షపాతం నమోదు



నగరి: బెండ పంటలో నిలిచిన వర్షపు నీరు



పాలసముద్రం: కోదండరామపురంలో నేలకొరిగిన వరిపంట



రొంపిచెర్ల: మొరవ పోతున్న ఏటి చెరువు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాపై ఫెంగల్ తుఫాను ప్రభావం చూపించింది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో జిల్లాలోని అన్ని మండలాల్లో పలు ప్రాంతాల్లో వరదనీరు ముంచెత్తింది. జిల్లాలోని నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో 90 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీశాయి. దీంతో చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి.

స్తంభించిన జనజీవనం

జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలతో జనజీవనం స్తంభించింది. జిల్లాలో నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లపై పడిపోయాయి. చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లడంతో రోడ్లపైకి అధికంగా నీరు చేరింది. చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్లే దారిలో కట్టమంచి వద్ద డ్రైనేజీ కాలువలోని నీరు ప్రధాన రోడ్డుపైకి చేరింది. అయితే నగరపాలక అధికారులు స్పందించి డ్రైనేజీ మరమ్మతులు వెంటనే చేయించారు. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలను నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పరిస్థితులను బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను చిత్తూరు నగరంలో పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారిక యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది.

నగరిలో అత్యధిక వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం నగరి మండలంలో అత్యధికంగా 132.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కార్వేటినగరంలో 119.4, నింద్రలో 116.0, పాలసముద్రంలో 104.4, విజయపురంలో 93.8, ఎస్‌ఆర్‌పురం లో 72.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 12 వ తేదీ జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో 1836.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 57.4 శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యల్పంగా గుడుపల్లె మండలంలో 16.0 శాతం వర్షపాతం నమోదైంది.

జలాశయం గేట్లు ఎత్తివేత

జిల్లా కేంద్రానికి సమీపంలో పెనుమూరు మండల పరిధిలో ఉన్న కలవగుంట (ఎన్టీఆర్ జలాశయం) అధిక వర్షాలకు పూర్తిగా నిండిపోయింది. అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు ఆదివారం ఉదయం జలాశయం గేట్లను ఎత్తివేశారు. దీంతో చిత్తూరు నుంచి పెనుమూరు వైపుగా రాకపోకలు స్తంభించాయి. జలాశయం గేట్లు ఎత్తివేయడంతో పెనుమూరు వైపుగా ప్రజలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తాయి. ఆ తర్వాత మరో ప్రత్యామ్నాయ రోడ్డును చూపించడంతో అటు వైపుగా ప్రజలు రాకపోకలు సాగించారు.



ఎన్టీఆర్ జలాశయం గేట్లు ఎత్తిన దృశ్యం

నేడు విద్యాసంస్థలకు సెలవు

అధిక వర్షాల కారణంగా ఈ నెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు ముందస్తుగా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సెలవు ప్రకటించారు. సోమవారం విద్యాసంస్థలు నిర్వహించకూడదన్నారు. అధిక వర్షాలకు విద్యార్థులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లనీయకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సెలవు రోజు తరగతులు నిర్వహిస్తే ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.



చౌడేపల్లె: నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



వడమాలపేట : కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు



ఎస్సార్‌పురం: వాగులను పరిశీలిస్తున్న అధికారులు



వడమాలపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ

గాలీవానకు నేలవాలిన స్తంభాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న గాలీవానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. చెట్లు విద్యుత్ పరికరాల మీద పడటంతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నారని చెప్పారు. జిల్లాలో మొత్తం 40 స్తంభాలు, 13 ట్రాన్స్‌ఫార్మర్లు, 1.2 కిలోమీటర్లు కండక్టర్ పాడైందన్నారు. 5 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయని చెప్పారు. దీంతో విద్యుత్ శాఖకు రూ.15 లక్షలు నష్టం వచ్చిందన్నారు. ఎక్కువగా నగరి, కార్వేటినగరం, బంగారుపాళెం, పాలసముద్రం ప్రాంతాల్లో నష్టం రాగా, రెడ్డిగుంట, గుడిపాల మండలాల్లో విద్యుత్ అంతరాయం తలెత్తిందని చెప్పారు. జిల్లాలోని 3 డివిజన్లలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు వివరించారు.



నగరిలో నేలకొరిగిన స్తంభం



బంగారుపాళ్యంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్

ఎయిడ్స్‌కు అవగాహనే ఆయుధం!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్‌కు అవగాహనే ఆయుధమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి అన్నారు. నగరంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలనకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోందని చెప్పారు. ఎయిడ్స్ బారిన పడిన వ్యాధిగ్రస్తులతో పాటు కొత్త కేసులు గుర్తించేందుకు అడుగులు వేస్తోందన్నారు. వివక్ష చూపుతారన్న భయంతో బాధితులు వ్యాధి ముదిరినా ఆస్పత్రులకు రాకపోవడంతో మహమ్మారి నిర్మూలన మన చేతుల్లోనే ఉందంటూ అవగాహన కల్పించి, కొత్త కేసులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడ్డామనే అనుమానం ఉంటే తక్షణమే సమీపంలో ఏఆర్‌టీ కేంద్రాల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాజిటివ్ అని తేలితే మందులు తీసుకోవటం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు శిరీష, శ్రీవాణి, దీపిక, లోకేష్, అనిల్, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న చుడా చైర్మన్, డీసీహెచ్‌ఎస్

క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


శ్రీ బాబు (ఫైల్)

గంగాధర నెల్లూరు: గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు, గంగాధరనెల్లూరుకు చెందిన శ్రీ బాబు (50) ఆదివారం ఇంటివద్ద గుండపోటుకు గురికాగా, కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. శ్రీ బాబు అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం గంగాధర నెల్లూరులో నిర్వహించనున్నారు. ఈయన ప్రస్తుతం యాదమరి మండలం గొల్లపల్లి హైస్కూల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏటీఎం ధ్వంసంపై ఫిర్యాదు

చంద్రగిరి : స్థానిక కొత్తపేటలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి ఇండియన్ బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేశాడు. వివరాలు.. ఏటీఎం సెంటర్‌లో చొరబడిన ఓ వ్యక్తి పెద్ద రాళ్లతో మిషన్‌పై దాడి చేశాడు. ఈ క్రమంలోనే దుండగుడు తాను గాంధీ అని, తుపాకీతో కాల్చేయండి అంటూ బిగ్గరగా కేకలు వేసినట్లు స్థానికులు వెల్లడించారు. దీంతో ఆ వ్యక్తికి మతిస్థిమితం లేదని భావించి వదిలిపెట్టినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న బ్యాంకు మేనేజర్ జయశ్రీ, చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఏటీఎం సెంటర్‌ను పరిశీలించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించడం లేదని, దీంతో అసలు సమస్య వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి కొత్త కార్డులకు దరఖాస్తులు

- సచివాలయాల్లో స్వీకరణ
- జనవరి నుంచి కార్డుల పంపిణీ
- ఆరు నెలలుగా రేషన్ తీసుకోని వారి కార్డులు రద్దు?



కాణిపాకం: కొత్తకార్డుల మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి 28వ తేదీ వరకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం సంక్రాంతికి కార్డులు ఇవ్వాలని యోచిస్తోంది. కొత్త డిజైన్‌తో కార్డులను ముద్రించనుంది. అర్హతను బట్టి కార్డులు మంజూరవుతాయని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో ప్రస్తుతం 6 లక్షలకుపైగా కుటుంబాలుండగా 5.3 లక్షల కార్డులున్నాయి. వీరికి 1,313 రేషన్ షాపుల ద్వారా సరుకులు అందుతున్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం, చక్కెర వంటి సరుకులను అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చాక విరివిగా రేషన్‌కార్డులు అందజేసింది. సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలో కార్డులు ఇచ్చింది. అది కూడా వలంటీర్లు అర్హుల ఇంటివద్దే దరఖాస్తులు స్వీకరించి, కార్డులను తలుపుతట్టి లబ్ధిదారులకు అందజేశారు. దీంతో మధ్యవర్తుల జోక్యం లేకుండా అర్హులకు కార్డులందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.

మళ్లీ 2014 మాదిరిగానే..?

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్‌కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీ పెత్తనంతో కార్డులు మంజూరయ్యేవి. దీంతో చాలా మంది అర్హులకు కార్డులు దక్కేవి కావు. అయినా వారికే కార్డులు దక్కేవి. ఈ కారణంగా కార్డులు రాని వారు నిరాశకు గురయ్యేవారు. ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం ప్రజా పంపిణీ కూడా అందేది కాదు. మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే రేషన్‌కార్డుల మంజూరులో కోతలు పడే అవకాశాలున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

కొత్తరేషన్ కార్డులు మాత్రమే కాదు, ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు. తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారికి రేషన్ కార్డులు ఇస్తారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కొందరు కార్డుదారులు ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ప్రభుత్వానికి ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

నిబంధనలు ఇలా...

- కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం విధి విధానాలను నిర్దేశించింది. కుటుంబాల ఆదాయ పరిమితిని బట్టి కార్డుల జారీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు రెండు రకాల ఆదాయ పరిమితుల బట్టి రేషన్ కార్డులు జారీ చేశారు.
- ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారీగా వార్షికాదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.2 లక్షల్లోపు వార్షిక ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. భూ విస్తీర్ణం మాగాణి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట భూమి అయితే 7.5 ఎకరాల్లోపు ఉండాలనే నిబంధనలు అమలు చేస్తున్నారు. తాజాగా ఈ నిబంధనలతోపాటు పట్టణాల్లో భూమితో సంబంధం లేకుండా వార్షికాదాయన్ని మాత్రమే పరిగణనలో తీసుకోవాలని నిర్ణయించింది.

నేటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు

జిల్లాలో సోమవారం నుంచి కొత్త కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. సచివాలయాల్లో ఉండే ఉద్యోగుల ద్వారా ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు అందజేయాలి. జనవరిలో నూతన రేషన్ కార్డును అందజేస్తాం. అర్హులే నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోండి. దళారులను నమ్మొద్దు.

- శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

జీసీటీఏ జిల్లా నూతన కార్యవర్గం


వాసుదేవరెడ్డి, తిరుకుమరన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం (జీసీటీఏ) జిల్లా అధ్యక్షునిగా వాసుదేవరెడ్డి (పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు అధ్యాపకులు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఈశ్వరబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గం జిల్లా కార్యదర్శిగా తిరుకుమరన్ (సావిత్రమ్మ కళాశాల), మహిళా సెక్రటరీగా వెనీల (సావిత్రమ్మ కళాశాల), కోశాధికారిగా భానుప్రకాష్ (పీవీకేఎన్ కళాశాల) ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండవ సారి జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘం నిబంధనలను పాటిస్తామన్నారు. సంఘం బలోపేతం కోసం తమ వంతు కృషి చేస్తామని లె లిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘం కార్యదర్శి వేము కృష్ణయ్య, జిల్లాలోని నగరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

బావి వద్ద వ్యక్తి అదృశ్యం

- బావి గట్టుపై చొప్పులు, బైక్, పైపంచ
- బావిలో గాలించినా లభించని ఆచూకీ


కుటుంబ సభ్యులు గాలించిన బావి (ఇన్‌సెట్) విజయేంద్ర (ఫైల్)

గంగవరం: వ్యవసాయ బావి వద్ద కనిపించిన వ్యక్తి కొద్దిసేపటికి అదృశ్యమయ్యాడు. అయితే అతని కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం నుంచి ఆ బావిలో వెతకడం మొదలెట్టారు. కుటుంబసభ్యుల కథనం మేరకు పెద్దపంజాణి మండలం పట్టగానిపల్లికు చెందిన విజయేంద్ర(45) కూలీ. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరి, గంగవరం మండలం కల్లుపల్లి గ్రామం వద్ద బెల్ట్ షాపులో మద్యం కొనుగోలు చేశాడు. అదే గ్రామం బైపాస్ రోడ్డుకు సమీపంలోని వ్యవసాయ బావి వద్ద తాగాడు. అంతే.. కొద్దిసేపటికి కనిపించకుండా పోయాడు. అయితే ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి రాత్రి గడిచినా రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. కల్లుపల్లి బైపాస్ పక్కన వ్యవసాయ బావి వద్ద తరచుగా మద్యం తాగడానికి వెళ్తుంటాడని గ్రామస్తులు చెప్పడంతో కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లారు. కుటుంబసభ్యులు ఆ బావి వద్ద గాలించారు. అక్కడ ఆయన బైక్, చొప్పులు, పైపంచ కనిపించాయి. దీంతో ఒకవేళ బావిలో పడిపోయి ఉంటాడేమో అన్న అనుమానంతో ఉదయం నుంచి బావిలో గాలించారు. బావి నిండా చెత్తా చెదారం ఎక్కువగా ఉండడంతో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఏమీ తోచక కుటుంబసభ్యులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఇదే విషయమై పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి పరిశీలించి వెళ్లారు.

పంటలపై ఏనుగుల దాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరిచెట్లు

రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు పరిధిలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటపొలాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో ఏనుగులు దోసతోటను, మొక్కజొన్న పంటను, 10 కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. రైతుల సమాచారంతో ఆదివారం ఉదయం అటవీ అధికారులు ఏనుగుల మందను గుర్తించి టపాకాయలను పేల్చి తమిళనాడు అడవిలోకి మళ్లించేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో ఏనుగుల మంద తిరిగి పొలాలపై దాడి చేసే అవకాశం ఉందని రాత్రిపూట రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని సూచించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


గజేంద్ర (ఫైల్)

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి సమీపంలో కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మండలంలోని మోతరంగనపల్లెకు చెందిన గజేంద్ర (34) చిత్తూరులో జైన్ డ్రిప్ ఇరిగేషన్ షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. శనివారం తిరుపతి సమీపంలోని రాయల చెరువులో అత్తగారింటికి వెళ్లి ఆదివారం ఉదయం స్వగ్రామానికి బయల్దేరాడు. నెల్లేపల్లి సమీపంలో చిత్తూరు నుంచి పుత్తూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి ఆ బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన గజేంద్రను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు స్థానికులు పేర్కొన్నారు. దీంతో మృతుని భార్య తనూజ గంగాధరనెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గడ్డివామి కూలి దూడ మృతి


మృతి చెందిన ఆవుదూడ

పెద్దపంజాణి: ఫెంగల్ తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గడ్డివామి కూలిపోయి ఆవు దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని శివాడి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, శివాడి గ్రామానికి చెందిన రైతు రవి తనకున్న ఆవు దూడను వర్షంలో తడిసిపోకుండా ఇంటి సమీపంలోని గడ్డివామి కింద కట్టేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు గడ్డివామి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో గడ్డివామి కింద ఉన్న ఆవుదూడ ఊపిరాడక మృతి చెందాయని బాధితుడు వాపోయాడు. దీంతో తనకు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వాన నీటిలో అంతిమ కష్టాలు

- తుపానుతో సాహసయాత్రగా శవయాత్ర


మోకాలిలోతు పారుతున్న నీటిలోనే శవయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

నగరి: మున్సిపల్ పరిధి 1వ వార్డు నగరి పేట గ్రామంలోని బడివీధిలో అనారోగ్యంతో మృతిచెందిన ఒక యువతి అంత్యక్రియలు అయినవాళ్లను అష్టకష్టాల పాల్జేసింది. ఫెంగల్ తుపాను ప్రభావం చిత్తూరు జిల్లాపై ఉండడంతో ఆరెంజ్ అలర్ట్‌ను కూడా ప్రభుత్వం ప్రకటించింది. రెండు రోజులపాటు విడవకుండా పడుతున్న వర్షాలకు లోతట్టు ప్రాంతమైన నగరిపేట బడివీధి పూర్తిగా జలమయమైంది. వర్షపు నీరు వెళ్లేందుకు దారిలేక పోవడంతో నీరు వీధులపై నుంచి శ్మశానం వరకు పారింది. దీంతో అనారోగ్యంతో మృతిచెందిన యువతి అంత్యక్రియలకు వెళ్లేందుకు వర్షపు నీరు అడ్డంకిగా మారింది. చేసేదేమీ లేక ప్రవహిస్తున్న మోకాలిలోతు నీటిలోనే శవంతోపాటు సాహసయాత్ర చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు శ్మశాన వాటికకు బంధువులు చేరుకున్నారు. అయితే బంధువుల కాళ్లు దిగబడిపోతూ బురదమయంగా మారిన శ్మశాన వాటికలోనే అంత్యక్రియలను పూర్తిచేశారు. వర్షం పడిన ప్రతిసారి ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంటోందని, వర్షం ఆగిన వెంటనే అధికారులు ఈ సమస్యను మరచిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రం.. పక్షపాతం!

- ఎస్వీయూ పరిధిలో 4 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం
- ఎగ్జామ్ సెంటర్ కేటాయింపులపై ఆరోపణలు
- వర్సిటీ అధికారుల తీరుపై విమర్శలు


ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ నెల 4 నుంచి 28వ తేదీ వరకు డిగ్రీ కోర్సులకు సంబంధించి మూడు, ఐదో సెమిస్టర్ ప్రారంభం కానుంది. మూడో సెమిస్టర్‌కు 5,250 మంది, ఐదో సెమిస్టర్‌కు 6,127 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల కేటాయింపు ప్రక్రియపై గందరగోళం నెలకొంది. మౌలిక వసతులు పక్కాగా ఉన్న కళాశాలలకు కూడా ఎగ్జామ్ సెంటర్ ఇవ్వలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు సెంటర్ల సంఖ్యను సైతం తగ్గించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయకారణాలతోనే ఎగ్జామ్ సెంటర్ల మార్పులు, కుదింపులు చేపట్టారని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా 84 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 64 సెంటర్లకు తగ్గించినట్లు తెలుస్తోంది.

విమర్శల వెల్లువ

ఉమ్మడి జిల్లాలో గత 10 ఏళ్లుగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎగ్జామ్ సెంటర్‌లకు సైతం ఈ పర్యాయం అనుమతులు ఇవ్వకపోవడం దారుణమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు మండిపడుతున్నాయి. పక్షపాత ధోరణితో సామాజిక వర్గ సమీకరణాలు, అధికారపార్టీకి అండగా ఉన్న కళాశాలలకు మాత్రమే సెంటర్లు కేటాయించారని విమర్శిస్తున్నాయి. అన్ని వసతులు, ఏర్పాట్లు కలిగిన కళాశాలలకు మొండిచెయ్యి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎటువంటి తనిఖీలు నిర్వహించకుండా వసతులు లేని కళాశాలలకు అనుమతులు కేటాయించడం సమంజసం కాదని వాపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కేటాయిస్తే న్యాయపోరాటం తప్పదని హెచ్చరిస్తున్నాయి. పరీక్ష కేంద్రాలను కుదించడంతో సుదూర ప్రాంతాల విద్యార్థులు అవస్థలు తప్పవని, ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలని సూచిస్తున్నాయి.

వ్యయం తగ్గించేందుకే..

గతంలో ఉన్న పరీక్ష కేంద్రాలలో 20 సెంటర్లను తగ్గించాం. పరీక్షల నిర్వహణకు పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వ్యయం తగ్గించేందుకే సెంటర్లను కుదించాం. కేటాయించిన ఎగ్జామ్ సెంటర్లలో మౌలిక వసతులపై ఆరా తీసిన తర్వాతే అనుమతులు ఇచ్చాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. సెంటర్ కేటాయింపులపై వస్తున్న ఆరోపణలు సత్యదూరం.

- అప్పారావు, వీసీ, ఎస్వీయూ

పట్టాభిరామునిగా పద్మావతీదేవి

- కనులపండువగా 'హనుమ' సేవ
- కల్పవృక్ష వాహనంపై విహరించిన సిరులతల్లి


కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో అమ్మవారు


హనుమంత వాహనంపై శ్రీపట్టాభిరాముడి అలంకరణలో అనుగ్రహిస్తున్న ఆకాశరాజ పుత్రిక

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి 8గంటలకు అమ్మవారు హనుమంత వాహనంపై పట్టాభిరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించా. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఉదయం 4గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అద్దాలమండపం నుంచి వేంచేపుగా వాహనమండపానికి తీసుకొచ్చి ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. రాజమన్నార్ అలంకరణలో చర్నాకోలు, దండం ధరించిన పద్మావతీదేవి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం జీయర్ల దివ్య ప్రబంధ పారాయణం, మంగళ వాయిద్యం, భజన బృందాల కోలాటం, సంప్రదాయ కళాబృందాల ప్రదర్శన, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ కనులపండువగా ఊరేగింపు సాగింది. మధ్యాహ్నం అమ్మవారికి వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిపించారు. రాత్రి హనుమంత వాహనంపై అమ్మవారు పట్టాభిరాముని అలంకరణలో విహరించారు. సేవల్లో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకుడు బాబుస్వామి పాల్గొన్నారు.

నేడు పద్మశాలీల పట్టువస్త్రాలు

అమ్మవారికి గజ వాహన సేవ సందర్భంగా పద్మశాలీలు పట్టువస్త్రాలు, పుట్టింటి సారె సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను ఆలయ అధికారులకు అందజేయనున్నారు.